హైవేలపై అంతా దుమ్మే..!

- నీటితో క్యూరింగ్ చేయించని అధికారులు
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



భైంసా–దేగాం మార్గంలో క్యూరింగ్ లేక కంకర, దుమ్ము లేచిన 161బీబీ జాతీయ రహదారి



బెల్‌తరోడా- నిర్మల్ జాతీయ రహదారిపై శుభ్రపరిచే క్రమంలో లేస్తున్న దట్టమైన దుమ్ము

భైంసాటౌన్: జాతీయ రహదారులపై దుమ్ము వాహనదారులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. రహదారుల పక్కన పేరుకుపోయిన దుబ్బ లేస్తుండడంతో ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు శ్వాస సంబంధ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. రెండురోజులుగా పట్టణంలో బెల్‌తరోడా–నిర్మల్ జాతీయ రహదారిపై ఇరువైపులా పేరుకుపోయిన దుమ్మును రహదారి నిర్వహణ సంస్థ సిబ్బంది రోడ్లను శుభ్రపరిచే ట్రాక్టర్‌తో తొలగిస్తున్నారు. అయితే సదరు యంత్రం రోడ్డు శుభ్రపరుస్తున్న క్రమంలో మరింత దట్టమైన దుమ్ము లేస్తోంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దుమ్ము లేవకుండా ముందుగా నీటితో క్యూరింగ్ చేసి తర్వాత శుభ్రపరచాలి. అలాగే బోధన్–భైంసా 161బీబీ జాతీయ రహదారి పనులు కొన్నిచోట్ల పూర్తిచేసి మరికొన్ని చోట్ల కంకర పోసి వదిలేశారు. దీంతో రోడ్డుపై కంకర తేలి, దుమ్ముధూళితో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం నీటితో క్యూరి ంగ్ చేపట్టడం లేదు. దీంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. భైంసాలోనూ జాతీయ రహదారులపై ఇష్టారీతిన పనులు చేస్తున్నా.. హైవే అధికారులు పర్యవేక్షించడం లేదనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా హైవే నిర్మాణ, నిర్వహణ పనులు పర్యవేక్షించి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

వేధింపులకు గురిచేస్తే ఫిర్యాదు చేయాలి



సోన్ :లెఫ్ట్‌పోచంపాడ్ గురుకులంలో షీటీం సభ్యులతో విద్యార్థులు

తానూరు: ఆకతాయిలు వేధింపులకు గురి చేస్తే ధైర్యంగా ఫిర్యాదు చేయాలని ఎస్సై సందీప్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని కే జీ బీవీలో విద్యార్థినులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. పాఠశాలకు వచ్చి వెళ్లేటప్పుడు అపరిచితుల బైక్‌పై ఎక్కవద్దన్నారు. ఆపదలో 100కు సమాచామిస్తే ఐదు నిమిషాల్లో మీ దగ్గరకు పోలీసులు వచ్చి సాయం చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అలేఖ్య, సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సోన్: మండలంలోని లెఫ్ట్‌పోచంపాడ్ గురుకుల పాఠశాల, కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు సైబర్‌నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, డయల్ 100, భరోసా కేంద్రం సేవలపై షీటీం ఎస్సై శ్రీలత ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సి పాల్ ఎం.ప్రేమలత, షీ టీం సభ్యులు, భరోసా కేంద్రం సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా టీకాలు వేయించాలి

- ముథోల్ ఎమ్మెల్యే రామారావ్‌పటేల్



గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావ్‌పటేల్

భైంసాటౌన్: పశు పోషకులు తప్పనిసరిగా తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని ముథోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని గోశాలలో పశువులకు ఉచిత టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కేంద్రప్రభుత్వం నేషనల్ లైవ్‌స్టాక్ హెల్త్ ప్రోగ్రాం కింద పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏటా రెండు సార్లు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం చేపడుతోందన్నారు. పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఏహెచ్ సురేశ్, భైంసా పశువైద్యాధికారి విఠల్, ఎంపీపీ అబ్దుల్ రజాక్, బీజేపీ నాయకులు గంగాధర్, తూం దత్తాత్రి, గోశాల కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

భూమిపూజ

సోన్: మండలంలోని సాకెర సంపదవనంలో రూ.70 వేలతో ఏర్పాటు చేసే బోరుబావికి శుక్రవారం ఎంపీపీ బర్ల మానసరెడ్డి భూమిపూజ చేశారు. ఏపీఓ మంజులరెడ్డి, కార్యదర్శి ప్రియాంకరెడ్డి, హరీశ్‌రెడ్డి, గంగారెడ్డి, నవీన్, పోశెట్టి, నరేశ్, టీపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర తీగలు తొలగింపు

ఖానాపూర్: పట్టణంలోని ఐదోవార్డు పరిధి టవర్స్ కాలనీలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను కౌన్సిలర్ పరిమి లత సురేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం సరిచేయించారు. కాలనీలోని నివాసాలను ఆనుకుని ఉన్న విద్యుత్ తీగలను స్థానికుల విన్నపం మేరకు విద్యుత్ అధికారులు, తొలగించి మరోచోట ఏర్పాటు చేశారు.

ఈవీఎంల పనితీరుపై అవగాహన

దస్తురాబాద్: మండలంలోని మున్యాల, పెద్దూర్ గ్రామాల్లో శుక్రవారం ఈవీఎంల వినియోగంపై అధికారులు ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈవీఎంల పనితీరు, ఓటు విధానం వివరించి సందేహాలను నివృత్తి చేశారు. ఆర్‌ఐ గంగన్న, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

ఖానాపూర్: పట్టణంలోని మెప్మా కార్యాలయంలో శుక్రవారం వరల్డ్ వాటర్ డేను పురస్కరించుకుని వాటర్ ఆర్గనైజేషన్ సహకారంతో మహిళాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నీరు, పారిశుధ్యం, పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మహిళాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు మేనేజర్ బ్రహ్మచారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సురేశ్, శివ, తదితరులు ఉన్నారు.

పనులు పకడ్బందీగా నిర్వహించాలి

దస్తురాబాద్: గ్రామాల్లో పారిశుధ్య పనులు పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీవో అనిల్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని గొడిసీర్యాల, గొడిసీర్యాల గోండుగూడ గ్రామపంచాయతీల్లో ఎంపీవో పర్యటించారు. అనంతరం పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు నిర్మించాలి

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మించాలని కోరుతూ ఎస్ఎంసీ కమిటీ మాజీ సభ్యుడు సయ్యద్ అయూబ్ మున్సిపల్ చైర్మన్ సత్యంకు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో వారిని కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్‌పాషా ఉన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



ముధోల్ గిరిజన గురుకుల పాఠశాలలో పరీక్ష ప్యాడ్లు అందిస్తున్న మోహన్‌రావు

ముధోల్: మండలకేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 479 మంది విద్యార్థులకు శుక్రవారం మోహన్‌రావుపటేల్ ప్రజాట్రస్ట్ ఆధ్వర్యంలో మోహన్‌రావు పటేల్ పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని.. వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి గురువులు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుభాష్‌పటేల్, పోతన్న, జీవన్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలను ప్రోత్సహించాలి



మహిళా న్యాయవాదులతో అంజు కుమార్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: మహిళలు అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని సీనియర్ న్యాయవాది, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలోని న్యాయవాదుల కార్యాలయంలో మహిళా న్యాయవాదులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మల్ కోర్టులో మహిళా న్యాయవాదులు పని చేయడం హర్షణీయమన్నారు. మహిళలు జడ్జిలుగా, ప్రభుత్వ న్యాయవాదులుగా ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. రాజకీయ రంగంలోనూ రాణించాలని పేర్కొన్నారు. నిర్మల్ న్యాయవాద పరిషత్ ప్రధాన కార్యదర్శి నరేందర్, ఉపాధ్యక్షుడు గంగాధర్, న్యాయవాదులు కొమ్మోజి రమణ, రాజు, మధుకర్, నిర్మల, నివేదిత, మాధవి, నవనీత, శ్వేత, వరలక్ష్మి, లిఖిత పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పరీక్ష సామగ్రి పంపిణీ

కుంటాల: మండలంలోని ఓలా ఉర్దూ మీడి యం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఎండీ యూనిస్ శుక్రవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. హెచ్ఎం రాహుల్‌కుమార్, ఉపాధ్యాయులు భోజన్న, ఇబ్రహీం, మహబూబ్, అహతేషా ముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

కుంటాల: మండల కేంద్రంలోని మున్నూరుకాపు సంఘ భవనంలో శుక్రవారం గ్రూప్–4కు ఎంపికైన తాటి సాయితేజ, ఫిజికల్ డైరెక్టర్‌గా ఎంపికైన సబ్బిడి దేవేందర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ సట్ల గజ్జారాం, జుట్టు లక్ష్మణ్, కొత్త కాపు గంగన్న, మహేశ్వర్, సంతోష్, రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

హజ్ సొసైటీ సభ్యుడికి ..

నిర్మల్‌టౌన్: హజ్ సొసైటీ సభ్యుడిగా నియమితులైన ఇలియాస్ అహ్మద్ కస్మిని పలువురు నాయకులు శుక్రవారం సన్మానించారు. మాజీ కౌన్సిలర్ అయ్యన్నగారి పోశెట్టి, ఫహీం, హైమద్‌ఖాన్, సోయిల్, అజీమ్, హర్షద్, సలీం, జహీర్ ఉన్నారు.

సీఐకి..

ఖానాపూర్: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నూతన సీఐ సైదారావును బాదనకుర్తి కాంగ్రెస్ నాయకులు శుక్రవారం సన్మానించారు. ఎస్‌కే సజ్జు, లక్ష్మీరాజం, గంగరాజం, నర్సయ్య, స్వామి, కిషన్ ఉన్నారు.

మున్సిపల్ చైర్మన్‌కు..

ఖానాపూర్: మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ చిన్నం సత్యంను నిర్మల్ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు. కమిషనర్ మనోహర్, తదితరులు ఉన్నారు.

ఆటో డ్రైవర్లకు..

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీ పాఠశాలలో చదివే పదో తరగతి విద్యార్థులను ఇంటి నుంచి పాఠశాలకు, పాఠశాల నుంచి ఇంటికి తీసుకెళ్తున్న ఆటో డ్రైవర్లను శుక్రవారం ఉపాధ్యాయులు సన్మానించారు. బాదనకుర్తి, సుర్జాపూర్‌తోపాటు ఖానాపూర్‌కు చెందిన 100 మందికి పైగా విద్యార్థులను క్షేమంగా తీసుకొస్తున్నందుకు సన్మానించినట్లు పేర్కొన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన హెచ్ఎం ఇర్రి నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మన అమ్మకు.. మనసారె



ఆలయంలో సారె సమర్పిస్తున్న సభ్యులు

నిర్మల్: జిల్లా కేంద్రానికి చెందిన శ్రీశైవక్షేత్ర వనితాశక్తి సంఘం ఆధ్వర్యంలో 'మన అమ్మకు..మన సారె' కార్యక్ర మం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని శ్రీచక్ర లలితాదేవి ఆలయంలో అమ్మవారికి సారె సమర్పించారు. ప్రతీనెల ఒక అమ్మవారి ఆలయంలో సామూహికంగా సారె సమర్పణ, పూజా కార్యక్రమాలు చేపడుతున్నట్లు సభ్యులు తెలిపారు. ఇందులో నిర్మల్‌కు చెందిన వనితాశక్తి సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

లక్ష్మణచాంద: మరమ్మతుల నేపథ్యంలో లక్ష్మణచాంద, వడ్యాల్ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ మహేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రేపు ఇసుక బహిరంగ వేలం

సార్పాపూర్(జి): మండలంలోని అర్లి(కే) గ్రామ శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన 70 ట్రాక్టర్ల ఇసుకను గత మంగళవారం మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. సీజ్ చేసిన ఇసుకకు ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలవారు వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

మండల కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

లోకేశ్వరం: మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘ భవనంలో ఆ సంఘం మండల కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ సంఘం మండలాధ్యక్షుడిగా మంద లింగన్న, ఉపాధ్యక్షుడిగా ఆకుల సంతోష్, గోపు చిన్నన్న, ప్రధాన కార్యదర్శిగా భోజన్న, జనరల్ సెక్రెటరీగా శ్రీనివాస్, సలహాదారులగా కొండపూరం రాజేశ్వర్, జ్ఞానేశ్వర్, మారు భూమన్న, సభ్యులుగా మోహన్, రమేశ్, దేవేందర్, సాయన్న, సంజీవ్, భోజారెడ్డి, శ్రీనివాస్, దేవన్న, నర్సయ్య, గంగాధర్, సాయిబాబాను ఎన్నుకున్నారు.

17న టి-10 రాష్ట్రస్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని లక్కీ క్రికెట్ అకాడమీలో ఈనెల 17న ఆదివారం ఉదయం 10 గంటలకు తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ బాయ్స్ టి-10 క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామని టి-10 క్రికెట్ అసోసియేషన్ సెక్రెటరీ సందీప్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 22 నుంచి 24వరకు జరిగే జా తీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు లక్కీ అకాడమీ డైరెక్టర్ సుదర్శన్ 81061 08335 నెంబర్‌లో సంప్రదించాలన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు స్కూల్ బోనోఫైడ్ సర్టిఫికెట్, ఆధార్ జిరాక్స్, రెండు పాస్ ఫొటోలతో రావాలని వారు సూచించారు.

బ్యాంకు వివరాలు, ఓటీపీలు చెప్పొద్దు

దస్తురాబాద్: అపరిచితులు ఫోన్ చేసి అడిగితే బ్యాంకు వివరాలు, ఓటీపీలు చెప్పవద్దని ఎస్సై యాసిర్ అరాఫత్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆకొండపేట గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, రోడ్డుప్రమాదాలు, రానున్న లోక్‌సభ ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్సై గ్రామస్తులతో మాట్లాడారు. రోజురోజుకూ సైబర్ నేరాలు పెరుగుతున్నాయని.. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సిబ్బంది శ్రావణ్, సురేందర్, రవి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఘనంగా ఇఫ్తార్ విందు

నిర్మల్‌టౌన్: పవిత్ర రంజాన్‌మాసం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని గుల్జార్ మజీద్‌లో శుక్రవారం ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కౌన్సిలర్ తౌహిద్ ఉద్దీన్ రప్పు మాట్లాడుతూ.. మత సామరస్యానికి ప్రతీకగా రంజాన్ పండుగ నిలుస్తుందన్నారు. సయ్యద్ యూసుఫ్, కలీం అహ్మద్, కలీం ఖాన్, షఫీ, రహీం, మజర్ పాల్గొన్నారు.

ఇలేగాంలో జాతర సందడి




ఆలయంలో భక్తులు

భైంసారూరల్: మండలంలోని ఇలేగాం గ్రామంలో బాపూజీ మహరాజ్ జాతర సంద డి నెలకొంది. శుక్రవారం ఆలయ ప్రాంగ ణం భక్తులతో కిక్కిరిసిపోయింది. వివిధ ప్రాంతాల భక్తులు బాపూజీ మహరాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదా లు స్వీకరించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. పలువురు యువకులు వలంటీర్లుగా మారి స్వచ్ఛందంగా సేవలు అందించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సోన్: మండలంలోని కూచన్‌పెల్లి గ్రామంలో ఉపాధిహామీ నిధులు రూ.ఆరు లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఎంపీటీసీ రాజేశ్వర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఇలాసరం లింగన్న, భూ మన్న, సాయికుమార్, హైమద్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న సీఐ సైదారావు

ఖానాపూర్: సర్కిల్ పరిధిలో వ్యాపారులు దుకాణాల వద్ద, ప్రజలు తమ వీధుల్లో స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఖానాపూర్ నూతన సీఐ సైదారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలంతా సహకరించాలని కోరారు. ఓపెన్ డ్రింకింగ్‌తో పాటు ట్రిపుల్ రైడింగ్, ర్యాష్‌డ్రైవింగ్ నిర్మూలనకు చర్యలు చేపడుతామన్నారు. అక్రమంగా మద్యం, ఇసుక, మొరం, రేషన్‌బి య్యం వంటి అక్రమ దందా లకు పాల్పడితే కేసులు న మో దు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. అనంతరం సీఐను ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీ డియా అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సన్మానించారు. ఎస్సై లింబాద్రి తదితరులున్నారు.

గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ



గర్భిణికి కిట్ అందిస్తున్న వైద్యురాలు చందన

దస్తురాబాద్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శుక్రవారం 22 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి, న్యూట్రిషన్ కిట్లు అందించారు. ఈసందర్భంగా వైద్యురాలు చందన గర్భిణులు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆరోగ్యవిస్తరణ అధికారి వేణుగోపాల్, హెల్త్ సూపర్‌వైజర్ లలిత, ల్యాబ్ టెక్నీషియన్ రాజేందర్, స్టాఫ్‌నర్సు పల్లవి, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

నిత్యం పోషకాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న సీడీపీవో నాగమణి

లక్ష్మణచాంద: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు నిత్యం పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో నాగమణి పేర్కొన్నారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఐసీడీఎస్, వరల్డ్‌విజన్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాలతో కూడిన ఆహారం అందిస్తున్నారని.. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పప్పులతోపాటు పాలు, కోడిగుడ్లు, చేపలు ఎక్కువ తీసుకోవాలని పేర్కొన్నారు. సూపర్‌వైజర్ భాగ్యవతి, అంగన్‌వాడీ టీచర్లు, వరల్డ్ విజన్ సభ్యులు పాల్గొన్నారు.

18న టీజేఎస్ సన్నాహక సమావేశం

ఖానాపూర్: కడెంలోని హరితరిసార్ట్‌లో ఈనెల 18న టీజేఎస్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పార్లమెంట్ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు తిలక్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఖానాపూర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశానికి టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోదండరాం, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హాజరవుతారని తెలిపారు. పార్టీ శ్రేణులు, ప్రజాసంఘాల నాయకులు, మేధావులు, నిరుద్యోగులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

అంబేద్కర్, కాన్షీరాం బాటలో నడవాలి



భీమ్ దీక్షలో పాల్గొన్న చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: ప్రతి ఒక్కరూ అంబేద్కర్, కాన్షీరాం చూపిన బాటలో నడవాలని నిర్మల్ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్‌బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో భీమ్ దీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కాన్షీరాం జయంతి నుంచి ఏప్రిల్ 14 (అంబేద్కర్ జయంతి) వరకు భీమ్ దీక్ష కొనసాగుతుందని పేర్కొన్నారు. అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ధర్మసమాజ్ కార్యాలయంలో..

నిర్మల్‌లోని ధర్మసమాజ్ పార్టీ కార్యాలయంలో కాన్షీరాం 90వ జయంతి నిర్వహించారు. వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ప్రచార కమిటీ సభ్యులు రామగిరి రవీందర్, రాజు, సుధాకర్, సొన్న భూమేశ్, షేక్ జాఫర్, శ్రీనివాస్, కత్తి శేఖర్, కందూర్ వినోద్ పాల్గొన్నారు.

అలరించిన వీడ్కోలు వేడుకలు



లక్ష్మణచాంద: పార్‌పెల్లిలో విద్యార్థులు

కుంటాల: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదోతరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు వేడుకలు అలరించాయి. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు, నాటికలు ఆకట్టుకున్నాయి. చక్కగా చదివి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఎంఈవో ముత్యం విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోన్: మండలంలోని జాఫ్రపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కంబైన్డ్ ఆటోమోటీవ్స్ అధినేత నార్లపురం రవీందర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ చదువుపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు, పాటలు అలరించాయి. ప్రధానోపాధ్యాయుడు పరమేశ్వర్, ఉపాధ్యాయులు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్, పార్‌పెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు మల్లాపూర్ ప్రత్యేకాధికారి, పశువైద్యాధికారి డాక్టర్ అజయ్‌కుమార్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు కేశం రమేశ్, మల్లాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగన్న, పార్‌పెల్లి ప్రధానోపాధ్యాయుడు మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'అధ్వానంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ'

ఖానాపూర్: ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక ఐసీడీఎస్ ఖానాపూర్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అధ్వానంగా మారిందని ఎంపీపీ అబ్దుల్ మోహిద్ అన్నారు. శుక్రవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. కేంద్రాలకు వచ్చే సరుకులను సకాలంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించడం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా చిన్న సైజు కోడిగుడ్లను.. కుళ్లిన కోడిగుడ్లను సరఫరా చేస్తున్నారని వాపోయారు. అధికారులు కేంద్రాలను పర్యవేక్షించాలని కోరారు.

చెడు వ్యసనాలకు దూరం ఉండాలి

పెంబి: యువత గంజాయి, డ్రగ్స్‌లాంటి చెడు వ్యసనాలకు దూరం ఉండాలని పెంబి ఎస్సై శంకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని మందపల్లి పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులతో మాట్లాడారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బాధ్యతగా ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. సైబర్ మోసాలు పెరుగుతున్నందున అపరిచితులకు బ్యాంకు వివరాలు, ఓటీపీలు చెప్పవద్దన్నారు. వాహనదారులు ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. ఎంపీవో రత్నాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.